క్లుప్తంగా...

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్: మరమ్మతులు, చెట్ల నరికివేత కారణంగా బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ శశిధర్‌రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా మేడ్చల్ చెక్ పోస్ట్, పారిశ్రామిక వాడలోని పరిశ్రమలకు, సీఎంఆర్ కళాశాలలకు ఉ.10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఆయన తెలిపారు.

గౌడవెల్లి సబ్ స్టేషన్ పరిధిలో...

మరమ్మతుల కారణంగా గౌడవెల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని డొమెస్టిక్, ఇండస్ట్రియల్, అగ్రికల్చర్ సర్వీసులకు బుధవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని రూరల్ ఏఈ పవ్వందు తెలిపారు.

ఘనంగా ఎల్లమ్మ కల్యాణం

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లిలో మంగళవారం ఎల్లమ్మ కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఒగ్గు పూజారులు ప్రత్యేక పూజల అనంతరం అమ్మవారి కల్యాణం జరిపారు. సాయంత్రం మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మద్దుల లక్ష్మిశ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేయడం సిగ్గుచేటు


బద్దం గోపాల్‌రెడ్డి సర్పంచ్

ఘట్‌కేసర్: ధనిక రాష్ట్రమంటూనే ఎస్టీఓలో విద్యుత్ బిల్లుకు సంబంధించిన చెక్కు పాస్ చేయకుండా పంచాయతీ కార్యాలయానికి విద్యుత్ సరఫరాను నిలిపేయడం సిగ్గుచేటని ఘనాపూర్ సర్పంచ్ బద్దం గోపాల్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో వసూలు చేసిన ఇంటి, నీటి పన్నులు ఇతర ఆదాయం మొత్తం ఎస్టీఓలో జమ చేశామన్నారు. విద్యుత్ బిల్లు చెల్లించడానికి డిసెంబర్ మాసం విద్యుత్ బిల్లు చెక్కును ఎస్టీఓకు పంపించామన్నారు. ప్రజల నుంచి వసూలు చేసిన సొమ్మును ప్రభుత్వం సొంతానికి వాడుకుంటూ తిరిగి ప్రజలను ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు. విద్యుత్ కనెక్షన్ తిరిగి ఇవ్వని పక్షంలో ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడతామని సర్పంచ్ హెచ్చరించారు.

పాషామియాపై దాడి అమానుషం


పాషామియాను పరామర్శిస్తున్న సభ్యులు

జవహర్‌నగర్: జవహర్‌నగర్ ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ అధ్యక్షుడు ఎండీ పాషామియా, అతడి కుటుంబ సభ్యులపై దాడి చేయడం అమానుష చర్య అని జవహర్‌నగర్ ప్రజా సమస్యల సాధన కమిటీ పేర్కొంది. దాడి జరిగిన విషయాన్ని తెలుసుకున్న కమిటీ ప్రతినిధులు మంగళవారం పాషామియాను, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.వారు మాట్లాడుతూ.. ఓ వర్గంకు చెందిన వారు ఈ దాడి చేశారని, ఈ దాడి వెనుక బీఆర్‌ఎస్‌కు చెందిన నేతలు హస్తం ఉందని, పోలీసుల స్పందించి నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు పీడీఎం చంద్రమౌళి, షేక్ షావలి, ఆంజనేయులు, శివబాబు, శ్రీకాంత్‌యాదవ్, ప్రవీణ్, శివనారాయణ, తిరుపతి, సావిత్రి, జావేద్, బాలు తదితరులు ఉన్నారు.


మల్లారెడ్డి ట్రస్ట్ ఔదార్యం

ఘట్‌కేసర్: ఇటీవల మృతి చెందిన వారి కుటుంబీకులకు మల్లారెడ్డి ట్రస్ట్ అండగా నిలిచింది. అంకుషాపూర్‌కు చెందిన మంజుల, కుమార్, ఇక్బాల్, అవుషాపూర్‌కు చెందిన మహేశ్, సుదర్శన్, కృష్ణ, అచ్చయ్య, బెజాన్బి, చౌదరిగూడకు చెందిన ఐలయ్య, మక్తకు చెందిన ఇస్తారి, ఎదులాబాద్‌కు చెందిన బాలకృష్ణ, సాలమ్మ, ఆంజనేయులు, శ్రీలత కుటుంబీకులను మంత్రి మల్లారెడ్డి ఆదేశానుసారం మంగళవారం ఆయా గ్రామాల నాయకులు బాధితుల ఇంటికెళ్లి మంగళవారం పరామర్శించారు. అనంతరం ఒక్కో కుటుంబానికి రూ.5 వేల చొప్పున మొత్తం రూ.70 వేలు అందజేశారు. కార్యక్రమంలో కొండల్‌రెడ్డి, వేణుగోపాల్, బిక్షపతిగౌడ్, గోపాల్‌రెడ్డి, ఐల య్యయాదవ్, బాలమణి, కుమార్‌ముదిరాజ్, చౌదరిగూడ సర్పంచ్ రమాదేవి, రాములుగౌడ్, బీఆర్‌ఎస్ చౌదరిగూడ అధ్యక్షుడు లింగంయాదవ్, ఎదులాబాద్ అధ్యక్షుడు శంకర్, చిరంజీవిముదిరాజ్, అర్జున్, స్వామిదాస్, ఆంజనేయులు, ట్రస్ట్ ఇన్‌చార్జి వేణు ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


కందాడి సతీశ్ రెడ్డి (ఫైల్)

ఘట్‌కేసర్: బంధువు దాడిలో గాయమై చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. సీఐ అశోక్‌రెడ్డి వివరాల ప్రకారం... సిద్దిపేట్ జిల్లా చిల్లాసాగర్ గ్రామంకు చెందిన కందాడి సతీశ్‌రెడ్డి(29) ఈ నెల 13న బంధువులు కందాడి శ్రీకాంత్‌రెడ్డి, కె.కన్నారెడ్డి, రఘువర్ధన్‌రెడ్డి, కె.శ్రీధర్‌రెడ్డితో కలిసి అవుషాపూర్‌లోని రాక్ ఎన్‌క్లేవ్ కన్వెన్షన్‌లో జరిగిన వివాహ విందుకు హాజరయ్యారు. విందు అనంతరం తిరుగు ప్రయాణంలో అర్ధరాత్రి కారు ఘట్‌కేసర్ మైసమ్మగుట్ట సమీపంలోకి రాగానే కందాడి శ్రీకాంత్‌రెడ్డి అందరి సమక్షంలో వరుసకు సోదరుడైన కందాడి సతీశ్‌రెడ్డిపై రాళ్లు, కడియంతో ఛాతీ, వెన్నెముకపై దాడి చేసి వెళ్లిపోయాడు. చికిత్స కోసం మొదట తులసి ఆస్పత్రి, మెరుగైన వైద్యం కోసం కిమ్స్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం సతీశ్‌రెడ్డి మృతి చెందాడు. మృతుడి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.



పురపాలికల్లో అవిశ్వాస జ్వాలలు

నోటీసులిచ్చినా కదలిక లేకపోవడంతో కలెక్టరేట్‌కు అసమ్మతి వాదుల పరుగులు

- ఆదేశాల కోసం జిల్లా అధికార యంత్రాంగం ఎదురుచూపులు
- గడువులోగా చర్యలు లేకుంటే న్యాయ స్థానాన్ని ఆశ్రయించేందుకూ సిద్ధం

సాక్షి,మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా పరిధిలోని పురపాలికల్లో అవిశ్వాస జ్వాలలు ఎగిసి పడుతున్నాయి. మూడు పురపాలక సంఘాల్లో మేయరు, చైర్మన్లపై అవిశ్వాసానికి సంబంధించిన నోటీసులు కలెక్టరేట్‌లో సమర్పించి దాదాపు 24 రోజులు గడుస్తున్నా.. అధికార యంత్రాంగం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంపై అసమ్మతి వాదులు అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. తమ నోటీసులపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో తెలుసుకునేందుకు సోమవారం కలెక్టరేట్‌కు తరలివెళ్లిన జవహర్‌నగర్, దమ్మాయిగూడ, మేడ్చల్ పురపాలక సంఘాలకు చెందిన అసమ్మతి వాదులు జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ ఆగస్త్యను కలిశారు. అవిశ్వాస తీర్మానంపై నోటీసులిచ్చినప్పటికీ స్పందన లేకపోవడంపై అసంతృప్తిని వ్యక్తం చేసిన అసమ్మతి వాదులు న్యాయస్థాన్ని ఆశ్రయించటానికి సిద్ధమవుతామని పేర్కొన్నట్లు తెలుస్తోంది.

స్పందన లేకపోవడంతో నిరసన...

జవహర్‌నగర్ నగర పాలక సంస్థ మేయరు కావ్యపై అవిశ్వాస తీర్మానంపై నోటీసులు ఇచ్చి దాదాపు 24 రోజులు అవుతున్నా.. స్పందన లేకపోవడంపై అసమ్మతి కార్పొరేటర్లు నిరసన ప్రదర్శిస్తున్నారు. ఇదే పరిస్థితి దమ్మాయిగూడ, మేడ్చల్ పురపాలక సంఘాల్లోని అసమ్మతి వాదుల్లో నెలకొంది. జిల్లా అధికారులు మాత్రం అవిశ్వాస తీర్మానాల నోటీసులకు సంబంధించిన అంశాన్ని రాష్ట్ర మున్సిపల్ అధికారులు నివేదించామని, వారి ఆదేశాల కోసం ఎదురు చూస్తున్నట్లు పేర్కొంటున్నట్లు వారు (బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు, కౌన్సిలర్లు) పేర్కొంటున్నారు.

ప్రస్తుతం మూడేళ్ల గడువు మాత్రమే...

పురపాలక సంఘాల్లో అవిశ్వాస నోటీసు ఇవ్వడానికి (మున్సిపల్ చట్టం ప్రకారం) ప్రస్తుతం మూడేళ్ల గడువు ఉంది. దీనిని నాలుగేళ్లకు పెంచాలంటూ గతంలో జరిగిన శాసనసభ సమావేశాల్లోనే సవరణ బిల్లును ప్రతిపాదించి ఆమోదించారు. ఆ తర్వాత గవర్నర్ సంతకానికి పంపగా, ప్రస్తుతం పెండింగ్‌లో ఉంది. ఇదిలా ఉండగా.. జిల్లాలో మాత్రం మంత్రితో సహా పలువురు బీఆర్‌ఎస్ నేతలు శాసనసభ ప్రతిపాదిత బిల్లుపై గవర్నర్ త్వరలో సంతకం పెట్టేస్తారని, అవిశ్వాసాల పేరిట ఎంత ప్రయత్నించినా ఫలితం ఉండదంటూ.. వ్యతిరేక శిబిరాల్లో ఉన్న డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లకు నచ్చచెబుతున్నట్లు తెలుస్తోంది. అలాగే ఎవరైనా అవిశ్వాసం నోటీసు ఇస్తే ఆ పూర్తి వివరాలను ప్రభుత్వానికి పంపాలని ఇప్పటికే జిల్లా యంత్రాంగానికి మౌఖిక ఆదేశాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. దీంతో అవిశ్వాస నోటీసులు ఇచ్చిన పాలకవర్గాన్ని సమావేశ పరిచేలా కలెక్టరు తేదీ ప్రకటించే అవకాశం ఉండదని పలువురు బీఆర్‌ఎస్ నాయకులు, మేయర్లు, చైర్మన్లు ప్రచారం చేసుకుంటున్నారు. ప్రస్తుతం పురపాలికల్లో మేయరు, డిప్యూటీ మేయరు, చైర్మన్, వైస్ చైర్మన్ స్థానాల్లో ఉన్న వారు కూడా ఇవే అంశాలను పరిగణలోకి తీసుకుంటూ.. తమకేం కాదనే ధీమాలో ఉన్నారు. మరికొందరు అయితే ముందు జాగ్రత్తగా అవసరమైన సభ్యుల మద్దతు కూడగట్టుకునే పనిలో నిమగ్నం కావడంతో పాటు మచ్చిక చేసుకునేందుకు ఆఫర్లు కూడా ప్రకటించినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

అవిశ్వాసంపై నోటీసులిలా..

- మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో జవహర్‌నగర్ నగరపాలక సంస్థ మేయర్ మేకల కావ్యపై అదే పార్టీకి చెందిన 20 మంది అసమ్మతి కార్పొరేటర్లు గత నెల 31న జిల్లా కలెక్టర్‌కు అవిశ్వాస నోటీసు అందజేశారు. అలాగే ఈ నెల 4న మళ్లీ కలెక్టరేట్‌లో మరో నోటీసును వారు అందజేశారు.
- మేడ్చల్ మున్సిపల్ చైర్మన్ మర్రి దీపికపై కూడా బీఆర్‌ఎస్‌కు చెందిన 15 మంది అసమ్మతి కౌన్సిలర్లు అవిశ్వాసం తీర్మానానికి సంబంధించిన నోటీసు కలెక్టరేట్‌లో సమర్పించారు.
- దమ్మాయిగూడ మున్సిపల్ చైర్మన్ ప్రణీతపై కూడా అదే పార్టీకి చెందిన 11 మంది అసమ్మతి కౌన్సిలర్లతో సహా ముగ్గురు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానానికి సంబంధించిన నోటీసును కలెక్టర్‌కు అందజేశారు.
- ఈ నోటీసుల్లో తెలంగాణ మున్సిపాలిటీ యాక్ట్–2019 సెక్షన్ 37 అనుసరించి నో కాన్ఫిడెన్స్ మోషన్ పిటిషన్ పురపాలక సంఘాల్లో మేయర్/చైర్మన్ సమర్పిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

కలెక్టరేట్ చుట్టూ అసమ్మతి వాదుల ప్రదక్షిణలు..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం చుట్టూ పురపాలక సంఘాల్లోని అసమ్మతి వాదులు, అధికార బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన కార్పొరేటర్లు, కౌన్సిలర్లు ప్రదక్షిణలు చేస్తున్నారు. దీనికి పురపాలక సంఘాల్లోని డిప్యూటీ మేయరు, చైర్మన్లు నాయకత్వం వహిస్తున్నారు. మేయరు, చైర్మన్ అధికార పీఠంపై గురి పెట్టిన పలువురు కార్పొరేటర్లు, కౌన్సిలర్లు కూడా అసమ్మతి వాదులకు చేదోడు వాదోడుగా నిలవడంతో పాటు వారిని మచ్చిక చేసుకునేందుకు పలు ఆఫర్లు సైతం ఇస్తున్నట్లు తెలుస్తోంది. అవిశ్వాసంపై నోటీసులు అందజేసిన 30 రోజుల్లో కౌన్సిల్ పాలకవర్గం సమావేశాన్ని ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈలోగా అవిశ్వాస నోటీసు పత్రంపై సభ్యులు చేసిన సంతకాలను సరైనవేనా.. కావా..? అనే అంశాలను సరి చూసుకోవడంతో పాటు సంఖ్యా పరంగా సభ్యులంతా ఉన్నారా? లేరా? అనే విషయాలను పరిగణలోని తీసుకోవాల్సి ఉంది. వీటన్నింటిని చెక్ చేయాలంటూ.. సంబంధిత పురపాలక కమిషనర్లకు ఆదేశాలు జారీ చేసిన జిల్లా అధికారులు మళ్లీ నిలిపివేయాలని మౌఖిక ఆదేశాలు ఇవ్వడంపై కార్పొరేటర్లు, కౌన్సిర్లలో చర్చ సాగుతోంది. ఈ నేపథ్యంలోనే అసమ్మతి వాదులైన డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు, వైస్‌చైర్మన్లు, కౌన్సిలర్లు న్యాయస్థానాన్ని ఆశ్రయించేందుకు సిద్ధమవుతున్నారు.

ముగిసిన కీసరగుట్ట బ్రహ్మోత్సవాలు

- వైభవంగా పూర్ణాహుతి
- ముగింపు పూజల్లో పాల్గొన్న భక్తులు


పూర్ణాహుతిలో ఆలయ చైర్మన్ తాటాకం రమేష్ శర్మ దంపతులు, కుటుంబ సభ్యులు తదితరులు

కీసర: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని కీసరగుట్ట శ్రీభవానీ రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో గత ఆరు రోజులుగా నిర్వహించిన బ్రహ్మోత్సవాలు పూర్ణాహుతితో వైభవంగా ముగిసాయి. ఈ నెల 16 నుంచి 21వ తేదీ వరకు కొనసాగిన బ్రహ్మోత్సవాలలో భాగంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు వైభవోపేతంగా సాగగా మంగళవారం బ్రహ్మోత్సవాలను సంపూర్ణం చేస్తూ వేదపండితులు పుల్లేటికుర్తి గణపతిశర్మ, వేద విద్యార్థుల బృందం ఆలయంలో ఉదయం నుంచి క్షేత్ర దిగ్బలిని నిర్వహించారు. ఆలయానికి నలు వైపుల ఉన్న దేవతామూర్తులకు వరి అన్నంతో చేసిన లడ్డూ ప్రసాదాలను నైవేద్యంగా సమర్పించారు. అనంతరం యాగశాలల్లో కలశాలకు పూజ చేసి దేవతలను తిరిగి సాగనంపే కార్యక్రమమైన పూర్ణాహుతిని వేద మంత్రోచ్ఛరణల నడుమ వైభవంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ తాటాకం రమేష్‌శర్మ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. అనంతరం కుటుంబ సమేతంగా హుడా పార్కులో, ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో వంటావార్పు చేసుకుని సాయంత్రం వరకు సరదాగా గడిపారు. ఈ పూజల్లో ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ సభ్యులు తాటాకం నారాయణశర్మ, తాటాకం వెంకటేష్‌శర్మ, ఉమాపతిశర్మ, తాటాకం నాగలింగంశర్మ, శ్రీనివాస్‌శర్మ, వేదపండితులు బల్‌రామ్‌శర్మ, రవిశర్మ, శ్రీనివాస్‌శర్మ, వీరేశం తదితరులు పాల్గొన్నారు.


స్వామివారికి అభిషేకం అనంతరం హారతి ఇస్తున్న వేదపండితులు


క్షేత్ర దిగ్బలి నిర్వహిస్తున్న వేద పాఠశాల విద్యార్థులు


పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

వాసవి క్లబ్ నూతన కార్యవర్గం



మేడ్చల్: వాసవీ క్లబ్ మేడ్చల్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అత్వెల్లికి చెందిన మందుముల కృష్ణమూర్తి గుప్తా, ప్రధానకార్యదర్శిగా తాళ్లపల్లి రమేష్‌గుప్తా, కోశాధికారిగా తాళ్లపల్లి నాగేష్ గుప్తాలు నియమితులయ్యారు. మంగళవారం పట్టణంలోని గడిమైసమ్మ ఆలయంలో వారు ప్రమాణస్వీకారం చేశారు.

పనుల పరిశీలన

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ 13వ వార్డులో రూ.3.5 లక్షల నిధులతో చేపడుతున్న అంతర్గత మురికి కాలువ నిర్మాణ పనులను మంగళవారం స్థానిక కౌన్సిలర్ మల్లికార్జున్ ముదిరాజ్, డీఈ దుర్గాప్రసాద్‌తో కలిసి మున్సిపల్ కమిషనర్ రాములు పరిశీలించారు. కార్యక్రమంలో హరికృష్ణ, సహు, సిబ్బంది పాల్గొన్నారు.



'ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం విఫలం'

కీసర: ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ నాయకుడు ఏనుగు రాజిరెడ్డి అన్నారు. 'ప్రజా గోస–బీజేపీ భరోసా' కార్యక్రమంలో భాగంగా నాగారం మున్సిపాలిటీ రాంపల్లి ఆర్టీసీ కాలనీలో మంగళవారం వివేకానంద శక్తి కేంద్రంలో కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజిరెడ్డి మాట్లాడుతూ.. ప్రజలు ఎన్నో సమస్యలతో సతమతమవుతుంటే బీఆర్‌ఎస్ ప్రభుత్వం, పాలకులు మాత్రం తమ సొంత పనులకు ప్రధాన్యత ఇచ్చుకుంటున్నారని విమర్శించారు. మున్సిపల్ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు ప్రజల తరపున బీఆర్‌ఎస్ ప్రభుత్వం, అధికారులతో పోరాటం చేయాలని బీజేపీ నాయకులకు ఆయన సూచించారు. సమావేశంలో జిల్లాల తిరుమల్‌రెడ్డి, వేణుగోపాల్, శ్యామ్‌సుందర్‌శర్మ బల్‌రామ్, లక్ష్మీ పాల్గొన్నారు.


సమావేశంలో ఏనుగు రాజిరెడ్డి తదితరులు

అందరి సహకారంతో బ్రహ్మోత్సవాలు విజయవంతం

కీసర బ్రహ్మోత్సవాల క్రీడల ముగింపు సభలో ఆర్డీఓ రవి

కీసర: అందరి సహకారంతో కీసరగుట్ట శ్రీభవానీ రామలింగేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు విజయవంతం అయ్యాయని కీసర ఆర్డీఓ రవి అన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించిన జాతర క్రీడోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని మంగళవారం సాయంత్రం కీసరగుట్టలో నిర్వహించగా ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ... రాష్ట్రంలో ప్రఖ్యాతి చెందిన కీసరగుట్ట శ్రీరామలింగేశ్వర స్వామి బ్రహోత్సవాల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం మొదటిసారిగా రూ.కోటి కేటాయించిందన్నారు. ఉత్సవాల సందర్భంగా వివిధ శాఖల అధికారులు యాత్రికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేయడంతో పాటు ఆరు రోజుల పాటు నిరంతర పర్యవేక్షణ చేయడం అభినందనీయమన్నారు. ఇక ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన జిల్లా స్థాయి క్రీడల్లో పోటీపడిన విద్యార్థులు మున్ముందు క్రీడల్లో మరింతగా రాణించాలని ఆకాంక్షించారు. భక్తులకు అన్నదానం చేసిన వివిధ సంఘాలను, క్రీడాకారులకు భోజన వసతి కల్పించిన మున్నూరుకాపు సంఘం సభ్యులకు ఆయన అభినందించారు. అనంతరం క్రీడాల్లో గెలుపొందిన విద్యార్థి విభాగం, యువజన విభాగం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా యుజవన, క్రీడల శాఖ అధికారి బలరాం రావు, డీఈఓ విజయకుమారి, ఎంఈఓ శశిధర్, రమేష్‌రెడ్డి, ఆలయ చైర్మన్ తాటాకం రమేష్‌శర్మ, ఈఓ సుధాకర్‌రెడ్డి, ఫౌండర్ ఫ్యామిలీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఆర్డీఓ రవి

ప్రజా సంక్షేమం కోసమే కాంగ్రెస్ పార్టీ పని చేస్తోంది

మేడ్చల్: దేశ, రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసమే కాంగ్రెస్ పార్టీ పని చేస్తోందని, అందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజలకు వివరించేందుకు ప్రజల చెంతకు వెళ్తుందని పీసీసీ అధికార ప్రతినిధి, కాంగ్రెస్ నియోజకవర్గ కోఆర్డినేటర్ సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని నూతన్‌కల్‌లో నిర్వహించిన 'హాత్‌సే హాత్ జోడో' యాత్రలో ఆయన పాల్గొని ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలో పార్టీ జెండాను ఆవిష్కరించి ప్రసంగించారు. మండల నాయకులు రమణారెడ్డి, ఆశసుల్తానా, అశోక్‌గౌడ్, షాహిన్ పాషా, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మహిళలు, చిన్నారులతో హరివర్ధన్‌రెడ్డి

బీజేపీ ఇంటింటి ప్రచారం


ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న కౌన్సిలర్ హంసారాణి


మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయలో బీజేపీ జిల్లా మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు, కౌన్సిలర్ హంసారాణి క్రిష్ణగౌడ్ బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు, బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ నెల 23న కండ్లకోయలో నిర్వహించే 'ప్రజాగోసా–బీజేపీ భరోసా' కార్నర్ మీటింగ్‌లో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో త్రివేణి, మమత, కావ్య, సురేఖ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మేడ్చల్‌రూరల్: మండలంలోని ఎల్లంపేట్ గ్రామంలో పలు అభివృద్ధి పనులకు మంగళవారం గ్రామ సర్పంచ్ వెన్నెల రామకృష్ణుడు, ఎంపీటీసీ కుమార్ యాదవ్‌లు పాలకవర్గ సభ్యులతో కలిసి శంకుస్థాపనలు చేశారు. గ్రామంలో భూగర్భడ్రైనేజీ, మంచి నీటి పైప్‌లైన్లు, సీసీ రోడ్డు పనులు చేపట్టనున్నట్లు సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ గణేశ్, వార్డు సభ్యులు రాజు, రమేశ్‌యాదవ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ రామకృష్ణుడు

నగర శివారు జిల్లాల్లో.. 1.42 కోట్ల మొక్కలు నాటడమే లక్ష్యం



మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలో హరిత హారానికి సిద్ధం అవుతున్న మొక్కలు

- తొమ్మిదో విడతలో పక్కా ప్రణాళికతో అధికార యంత్రాంగం ముందడుగు
- మేడ్చల్–మల్కాజిగిరిలో 63.70 లక్షల మొక్కలు నాటేందుకు ప్రణాళిక
- జులై నుంచి హరితహారం నిర్వహించేందుకు కసరత్తు
- గతంలో నాటిన మొక్కల్లో 30 శాతం ఎండిపోవడంతో పకడ్బందీ చర్యలు
- పట్టణాలు, గ్రామాల్లో నర్సరీల పెంపు
- పర్యవేక్షిస్తున్న డీఆర్‌డీఏ, అటవీ శాఖ, పురపాలక సంఘాలు

సాక్షి,మేడ్చల్ జిల్లా: తొమ్మిదో విడత హరితహారంలో భాగంగా నగర శివారుల్లో 1.42 కోట్ల మొక్కలు నాటేందుకు అధికార యంత్రాంగం నిర్ణయించింది. ఈ మేరకు 2023–24లో నగర శివారు జిల్లాలైన మేడ్చల్–మల్కాజిగిరిలో 63.70 లక్షల మొక్కలు, రంగారెడ్డిలో 78.57లక్షల చొప్పున మొత్తంగా 142.27 లక్షల మొక్కలు నాటేందుకు సన్నద్ధమవుతున్నారు. ఇందులో భాగంగా ఒక్కో జిల్లా పరిధిలో 40 ప్రభుత్వ శాఖలతో కలిసి జిల్లా అటవీ శాఖ ప్రణాళిక రూపొందించింది. శివారు జిల్లాల్లో ఇప్పటి వరకు హరితహారంలో నాటిన మొక్కల్లో 30 శాతం ఎండిపోయినట్లు గుర్తించినట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని పలు పర్యాయాలు నిర్వహించిన హరితహారం సమీక్షల్లో గుర్తించిన అధికార యంత్రాంగం తొమ్మిదో విడత హరితహారంలో అధిక సంఖ్యలో నాటుతున్న మొక్కలకు సంస్థలు, శాఖలే సంరక్షణ బాధ్యతలను చేపట్టేలా ప్రణాళిక ఖరారు చేస్తోంది. పండ్లు, పూల మొక్కలతో పాటు టేకు వంటి 40 రకాల మొక్కలు ప్రతి గ్రామ, పట్టణ పొలిమేర పరిధితో కలుపుకుని నాటేలా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. పురపాలికలు, పంచాయతీ పరిధిలోని ప్రతి కుటుంబ సభ్యులతో పాటు స్మృతి వనాలు, డంపింగ్ యార్డులు, పార్కులు, లేఅవుట్లు, గ్రామ కంఠం, చెరువు గట్లు, ప్రభుత్వ స్థలాల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటేందుకు యంత్రాంగం కసరత్తు చేస్తోంది. పరిశ్రమలు, రైతు పొలాల్లో ఉపాధి హామీ కింద బండ్, బ్లాక్ ప్లాంటేషన్‌పై మొక్కలు నాటేందుకు కూడా కార్యాచరణ రూపొందించారు. ఎక్సైజ్, విద్యా, పంచాయతీ రాజ్, పురపాలక శాఖలు పెద్ద ఎత్తున మొక్కలు నాటేందుకు పలు చోట్ల ప్రదేశాలను గుర్తిస్తున్నాయి. మిగతా ప్రభుత్వ శాఖలతో పాటు పంచాయతీలు, పురపాలికల్లో కూడా మొక్కలు నాటేందుకు గుంతలు తీసే పనిపై నిమగ్నమైనట్లు అధికారవర్గాలు చెబుతున్నాయి.

గతంలో మొక్కల సంరక్షణలో లోపాలివే..

హరితహారంలో భాగంగా గతంలో నగర శివారుల్లో నాటిన మొక్కల్లో దాదాపు 30 శాతం మొక్కలు ఎండిపోయిన విషయాన్ని గుర్తించిన అధికార యంత్రాంగం మొక్కల సంరక్షణపై తగిన విధంగా చర్యలకు సిద్ధమవుతోంది. మొక్కలకు ఫెన్సింగ్ లేకపోవటంతో పాటు ఎదుగుదలకు నీటి వసతి సరిగ్గా కల్పించకపోవడంతో నాటిన మొక్కల్లో 30 శాతం ఎండిపోగా, మరి కొన్ని మొక్కలు ఎర్ర పడ్డాయి.

సంరక్షణకు ప్రత్యేక ప్రణాళిక...

మొక్కలు ఉచితంగా పంపిణీ చేసినప్పటికీ గుంతలు తీసేందుకు డబ్బులు చెల్లించారు. పెద్ద మొక్కలు నాటేందుకు మూడు గుంతలు తీస్తే రూ.180, చిన్న మొక్కలు నాటేందుకు 13 గుంతలు తీస్తే రూ.180 చొప్పున చెల్లిస్తున్నారు. మొక్కలను విద్యా సంస్థలు, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, వెంచర్లు, రోడ్లకు ఇరువైపులా నాటారు. వీటిని నాటేందుకు ఈజీఎస్ నిధులను ఉపయోగించగా, పలు సంస్థలు కూడా కొన్ని నిధులు వెచ్చించాయి. మొక్కలు నాటడం ఉద్యమంలా చేపట్టినప్పటికీ సంరక్షించడంలో మాత్రం కొన్ని సంస్థలు విఫలమైనట్లు తెలుస్తోంది. పలు విడతల్లో నాటిన మొక్కలు పచ్చగా ఉన్నట్లు గతంలో నగర శివారు జిల్లాల్లో పర్యటించిన రాష్ట్ర అధికారుల బృందం అధికార యంత్రాంగానికి కితాబు ఇచ్చాయి. ఈ నేపథ్యంలో మరింత ఉత్సాహం, పట్టుదలతో మొక్కలు నాటడంతో పాటు సంరక్షించే చర్యలకు అధికార యంత్రాంగం పక్కా ప్రణాళికను ఖరారు చేస్తోంది. నగర శివారు జిల్లాల్లో ఏడు శాతంగా ఉన్న అడవులు(ఫారెస్ట్) 33 శాతానికి పెంచడమే లక్ష్యంగా అధికార యంత్రాంగం ముందడుగు వేస్తోంది. ఇందులో భాగంగా తొమ్మిదో విడత హరితహారంలో నగర శివారు జిల్లాల్లో 1.42 కోట్ల మొక్కలను ఉద్యమంలా నాటడంతోపాటు సంరక్షణకు ముందస్తు చర్యలకు అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది.

హరితహారం కోసం నర్సరీలు...

హరితహారంలో భాగంగా నగర శివారు జిల్లాల్లో 2023–24 సంవత్సరంలో 1.42 కోట్ల మొక్కలు నాటడమే లక్ష్యంగా 619 గ్రామ పంచాయతీలు, 28 పురపాలక సంఘాల్లో మొత్తంగా 576 ప్రాంతాల్లో నర్సరీలను అధికార యంత్రాంగం పెంచుతోంది. ఈ నర్సరీల్లో 1.68 కోట్ల మొక్కలు ఉత్పత్తి అయ్యేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. 400 గ్రామ పంచాయతీల్లో గ్రామీణ అభివృద్ధి సంస్థ నర్సరీలను పర్యవేక్షిస్తుండగా, మిగతా పంచాయతీల్లోని నర్సరీలను అటవీ శాఖలు చూసుకుంటున్నాయి. పురపాలక సంఘాల్లోని నర్సరీలను సంబంధిత అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

ఆర్గానిక్ వ్యవసాయ పద్ధతులను అలవర్చుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న డీఏఓ మేరీరేఖ

శామీర్‌పేట్: ఆర్గానిక్ వ్యవసాయ పద్ధతులను అలవర్చుకోవాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా వ్యవసాయ అధికారి మేరీ రేఖ అన్నారు. తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరమ్ ఆధ్వర్యంలో సేంద్రియ వ్యవసాయంపై మంగళవారం మూడుచింతలపల్లి రైతు వేదికలో మండలంలోని పలువురు రైతులకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా డీఏఓ మాట్లాడుతూ.. అధిక మోతాదులో రసాయనాల వాడకం వలన మిత్ర పురుగులు చనిపోతాయని, భూమి, నీరు కలుషితం అవుతాయన్నారు. రసాయనాలు ఎక్కువ మోతాదులో వినియోగించంతో మానవుల ఆరోగ్యం, పశు పక్షాదులకు నష్ట వాటిల్లుతుందన్నాదన్నారు. రైతులు ప్రకృతి వ్యవసాయం వైపుగా దృష్టి సారించాలని సూచించారు. తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం యూఎస్‌ఏ చైర్మన్ సధానంద్ రెడ్డి మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా 25 గ్రామాలను ఎంపిక చేసుకుని ప్రకృతి వ్యవసాయం చేసేందుకు కృషి చేయడం, దేశీ విత్తనాలు, భూ పరీక్షలు, యంత్రాలు అందజేయడం జరుగుతుందన్నారు. మూడుచింతలపల్లి మండలాన్ని పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేసుకున్నామని, ప్రతీ గ్రామం నుంచి కొందరు రైతులను ఎంపిక చేసుకుని ఆర్గానిక్ వ్యవసాయ విధానాలు తెలిపేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ హారికమురళీగౌడ్, ఏడీఏ వెంకటరాంరెడ్డి, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి, సర్పంచ్‌లు జాంరవి, సింగం ఆంజనేయులు, హరిమోహన్‌రెడ్డి, కృపాకర్‌రెడ్డి, రాంచంద్రయ్య, రైతులు పాల్గొన్నారు.